క్లుప్తంగా

దివ్యాంగ బాలికకు వీల్‌చైర్ అందజేత



దివ్యాంగ బాలికకు వీల్ చైర్ అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: కలెక్టరేట్ ప్రాంగణంలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ బేస్తవారిపేట మండలం సలకలవీడు మజరా కొత్తపల్లి గ్రామానికి చెందిన చింతా నాగమణి అనే దివ్యాంగ బాలికకు వీల్‌చైర్ అందజేశారు. లబ్ధిదారుని అమ్మమ్మ చిత సారమ్మ తన మనవరాలికి వీల్ చైర్ లేనందున ఇబ్బందులు పడుతుందని జాయింట్ కలెక్టర్‌కు విన్నవించింది. స్పందించిన జేసీ వెంటనే దివ్యాంగుల సంక్షేమ శాఖ ద్వారా వీల్ చైర్ అందజేశారు. దీనిలో దివ్యాంగుల శాఖ ఏడీ అర్చన ఇతర అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యంపై కేసు నమోదు



జలరాం (ఫైల్)

కొత్తపట్నం: వృద్ధుడు అదృశ్యం కావడంతో స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపట్నం మండలం మడనూరు గ్రామానికి చెందిన బిళ్లా జలరాం (75) ఈ నెల 10వ తేదీ ఇంటి నుంచి ఈతముక్కలవైపు నడుచుకుంటూ వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. భార్య శీనమ్మ కూలి పనులకు వెళ్లి సాయంత్రానికి ఇంటికి వచ్చేసరికి భర్త కనిపించలేదు. రాత్రంతా వేచి చూసింది. బంధువులకు ఫోన్ చేసి అడిగింది. ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో కొత్తపట్నం పోలీస్‌స్టేషన్‌లో శీనమ్మ ఫిర్యాదు ఇచ్చింది. ఆ మేరకు రైటర్ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అధికస్థాయి పోషకాలతో పాల దిగుబడి పెంపు



పశుగ్రాస వారోత్సవాల్లో పాల్గొన్న వెటర్నరీ డీడీ, ఏడీ

చీమకుర్తి: అధిక స్థాయి పోషకాలున్న పశుగ్రాసాలు అందిస్తే పాల దిగుబడి పెరుగుతుందని వెటర్నరీ డీడీ రమేష్‌బాబు, ఏడీ లావణ్యకుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని కూనంనేనివారిపాలెంలో పశువుల పెంపకం యూనిట్లను వారు సందర్శించారు. పశువులకు అందిస్తున్న పశుగ్రాసం నాణ్యతను పరిశీలించారు. పశుగ్రాసంలో ఉన్న మేలైన రకాల గురించి వివరించారు. రైతులు తగిన జాగ్రత్తలు పాటిస్తే లాభాలు ఆర్జించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక డాక్టర్ ప్రశాంతి, రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈఓ వెంకటరత్నం

కొమరోలు: స్థానిక ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మండల విద్యాశాఖాధికారి బొర్రా వెంకటరత్నం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత పాఠశాల రికార్డులను పరిశీలించిన అనంతరం విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని తెలిపారు.

విద్యుదాఘాతంతో కూలీకి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన నాగశేషు

కొమరోలు: కూలి పనులు చేసుకుంటున్న ఓ వ్యక్తికి విద్యుత్ తీగ తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ఇడమకల్లులో శుక్రవారం జరిగింది. మండలంలోని ఇడమకల్లు గ్రామానికి చెందిన ఎం.నాగశేషు అనే కూలీ గ్రామంలోని సత్రం వద్ద పని చేస్తున్న సమయంలో దగ్గరగా ఉన్న విద్యుత్ సరఫరా అవుతున్న తీగ తగలడంతో నాగశేషుకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న స్థానికులు గమనించి వెంటనే 108 వాహనంలో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు మార్కాపురంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సెంట్రల్: పరిశ్రమల నిర్వహణలో నిర్దేశిత భద్రతా ప్రమాణాలు పాటించేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవన్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ), కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ), ఏపీఐఐసీ, అగ్నిమాపక, ఫ్యాక్టరీలు, కార్మిక శాఖ అధికారులతో శుక్రవారం ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా విభాగాల వారీగా చేపడుతున్న కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, పర్యావరణ పరిరక్షణ, తదితర అంశాలను సంబంధిత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ పరిశ్రమల నిర్వహణ నిబంధనల మేరకు ఉండేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. కార్మికులకు యాజమాన్యాల ద్వారా లభించాల్సిన ప్రయోజనాలు కచ్చితంగా అందేలా చూడాలని స్పష్టం చేశారు. జిల్లా నుంచి వలసలు నివారించడానికి స్థానికంగా ప్రతిపాదిత పరిశ్రమలు త్వరగా అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బాలలతో ఎవరూ పనిచేయించుకోకుండా చూడాలని, పోలీస్, ఐసీడీఎస్, కార్మిక, విద్యాశాఖ అధికారులు సంయుక్త తనిఖీలు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో డీఐసీ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, పీసీబీ ఈఈ రాఘవరెడ్డి, ఏపీఐఐసీ జెడ్ఎం విజయరత్నం, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీకాంత్, ఫ్యాక్టరీలు, కార్మిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో స్కందషష్ఠి వేడుకలు



నాగేంద్రస్వామి పుట్టలో పాలు పోస్తున్న మహిళా భక్తులు



నాగేంద్రస్వామికి అభిషేకం చేస్తున్న మహిళా భక్తులు

- నాగేంద్రస్వామికి మొక్కులు తీర్చుకున్న భక్తులు

ఒంగోలు మెట్రో: క్రోధి నామ సంవత్సరం ఆషాడ మాసం శుక్రవారం స్కందషష్ఠి పండుగ సందర్భంగా నగరంలోని సుబ్రహ్మణ్యస్వామి దేవాలయాల్లో అభిషేకాలు, అర్చనలు వైభవంగా నిర్వహించారు. స్థానిక రంగారాయుడు చెరువు దగ్గర సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానంలో, మంగమూరు రోడ్డు అయ్యప్పనగర్లో మురళీకృష్ణ మందిరం దగ్గర నాగేంద్రస్వామికి, ఒంగోలు కొండమీద సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానంలో, సీతారాంపురంలోని సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానంలో, గోపాల్ నగరంలోని జంట నాగేంద్రస్వామి మందిరంలో మూలవిరాట్లకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఏడు గంటలకు పాలు, పెరుగు, తేనె, చక్కెర, పండ్ల రసాలు, పంచామృతాల అభిషేకం, సుగంధ పరిమళ ద్రవ్యాలు, పసుపు, కుంకుమ, గంధం, విభూది, చందనంతో అభిషేకం నిర్వహించి స్వామివారి మూలవిరాట్లను వివిధ రకాల పూలతో అలంకరించారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించి కర్పూర హారతితో భక్తులకు దివ్యదర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. షష్ఠి పండుగ సందర్భంగా స్థానిక మహిళా భక్తులు రంగారాయుడు చెరువు దగ్గర ఉన్న పుట్టలో, ఒంగోలు కొండ మీద సుబ్రహ్మణ్యస్వామి పుట్టలో జంట నాగేంద్రులకు ఆవు పాలు పోసి చలిమిడి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కుటుంబ విలువలకు పట్టం



నాలో నువ్వే నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు



చీకట్లో చిందులాట నాటికలోని ఓ సన్నివేశం

- ఆకట్టుకున్న 'నాలోన నీవే' నాటిక
- ఉత్సాహంగా రంగభూమి నాటిక ప్రదర్శనలు

ఒంగోలు మెట్రో: జిల్లా రంగ భూమి కళాకారుల సంఘం 7వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్ ఆవరణలో శుక్రవారం రాత్రి నిర్వహించిన నాటికల ప్రదర్శనలు ప్రేక్షకుల్ని చైతన్యపరిచాయి. సందేశాత్మక హాస్య కథనాలతో భిన్న వైవిధ్యాలను ప్రదర్శించి కళాకారులు చూపరులతో కేరింతలు కొట్టించారు. రంగభూమి అధ్యక్షుడు బేతంశెట్టి హరిబాబు, ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాదు, కోశాధికారి ధేనువకొండ వెంకట సుబ్బారావు, కమిటీ సభ్యులు నిర్వాహకులుగా వ్యవహరించారు. ప్రదర్శనలో భాగంగా ముందుగా కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్, గుంటూరు వారు బొమ్మిడి రామకృష్ణ రచనా దర్శకత్వంలో నాలోన నీవే నాటికను చక్కగా ప్రదర్శించారు. కళాకారులు వారి పాత్రల్లో ఒదిగిపోయారు. సంభాషణలు చురుకుదనాన్ని కలిగిస్తూ మనల్ని ఆలోచింపజేసే విధంగా ఉన్నాయి. నేపథ్య సంగీతం, రంగా అలంకరణ నాటికకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జానకి పాత్రలో కరణం సరిత, పార్వతి పాత్రలో ఉమామహేశ్వరి, శ్రీరామ్‌గా బొమ్మిడి రామకృష్ణ, ధర్మాత్మగా బొమ్మిడి రాయుడు పోటీపడి నటించారు. రెండో నాటికగా తిరుమల ఆర్ట్స్ గుంటూరు వారు కమల కంటి మోహనవలి రచన, దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. 'చీకట్లో చిందులాట' పేరుతో ప్రదర్శించిన నాటిక ప్రేక్షకుల్ని అత్యంత గిలిగింతలు పెట్టింది. కడుపుబ్బా నవ్వించింది.

సరసమైన ధరలకు నిత్యావసరాలు



నిత్యావసర వస్తువులు అందిస్తున్న అధికారులు, నాయకులు

చీమకుర్తి: ప్రజలకు అవసరమైన కందిపప్పు, బియ్యం వంటి నిత్యావసర సరుకులను ప్రభుత్వం సరసమైన ధరలకు అందిస్తోందని తహసీల్దార్ సురేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఈశ్వరరాజు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానంలో ప్రజలకు అవసరమైన నిత్యావసరాలను చీమకుర్తి పట్టణంలో ఎంపిక చేసిన 5 కేంద్రాల్లో అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు స్థానిక నాయకులు మన్నం ప్రసాద్, కాట్రగడ్డ రమణయ్య, రావిపాటి రాంబాబు, గొల్లపూడి సుబ్బారావు, స్థానికులు పాల్గొన్నారు.

మోదీని ఇంటికి సాగనంపుతాం



రైల్వేస్టేషన్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు

ఒంగోలు టౌన్: కార్మికులతో పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీని ఓడించి గుణపాఠం చెప్పామని, కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రధాన మంత్రి మోదీని కూడా ఇంటికి సాగనంపుతామని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు ఆర్.సుధీర్ హెచ్చరించారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం ఒంగోలు రైల్వేస్టేషన్ ఎదురుగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మేము నీ ప్రధాన మంత్రి సీటు అడగడం లేదని, మాకు నీ మన్‌కీ బాత్‌లు వద్దని ఆయన స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించాలని కోరారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సరుకు రవాణా చేసిన కార్మికులను పట్టించుకోకుండా అదానీ, అంబానీలకు ప్రభుత్వ ఆస్తులను కట్టబెట్టేందుకు మోదీ చేస్తున్న ప్రయత్నాలను దేశ ప్రజల గమనిస్తున్నారని చెప్పారు. రైల్వే కార్మికుల కడుపులు కొట్టొద్దని చెప్పారు. కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం పోరాటాలు చేస్తామన్నారు. పఠాన్ కోట్‌లో కాల్పులు జరిపినా వెనక్కి తగ్గకుండా హక్కులు సాధించిన చరిత్ర మజ్దూర్ యూనియన్‌కు ఉందని అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో యూనియన్‌ను గెలిపించాలని, ఓపీఎస్ ఎలా రాదో చూస్తామని చెప్పారు. బ్రాంచి చైర్మన్ ఇమాన్యుయేల్, కార్యదర్శి బీవీఎస్ తేజ, కోశాధికారి సునీత, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

17న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

ఒంగోలు మెట్రో: స్థానిక గాంధీరోడ్డు అమలనాథునివారివీధిలో కొలువై ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి దేవస్థానంలో ఆషాడ మాసం సందర్భంగా ఈ నెల 7 నుంచి 16వ తేదీ వరకు తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం ఏడు గంటల నుంచి విష్ణుసహస్రనామ స్తోత్రం, హనుమాన్ చాలీసా పారాయణ, ముకుంద మాలపారాయణ, గోవిందనామాల పఠనం, శ్రీ వెంకటేశ్వరస్వామి వారి అష్టోత్తర శతనామావళి పారాయణ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా 13వ తేదీ సాయంత్రం 5:30 గంటలకు శ్రీ శ్రీనివాస గానామృతం, 16వ తేదీ సాయంత్రం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవికి శాకాంబరి అలంకరణ, 17వ తేదీ తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉదయం 8:30 గంటలకు సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్రత పూజలో పాల్గొనే దంపతులు శ్రీ వాసవీ కోలాట భజన మండలి ప్రతినిధులను 92983 00966, 89777 41414 నంబర్ల ద్వారా సంప్రదించాలని ఆలయ నిర్వాహకులు సూచించారు. స్థానిక భక్తులందరూ తొలి ఏకాదశి పూజల్లో పాల్గొని స్వామివారి కరుణాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

వైద్య ఖర్చులకు సూర్యశ్రీ ట్రస్ట్ చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ఒంగోలు సెంట్రల్: సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓ వ్యక్తి వైద్య ఖర్చులకు శుక్రవారం ఆర్థిక చేయూత అందించారు. విజయవాడకు చెందిన విప్పర్ల రంగారావు గుండె జబ్బుతో బాధపడుతుండగా, ట్రస్ట్ కార్యదర్శి షేక్ సర్దార్‌బాషా ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌ఐ ప్రవీణ్ సహకారంతో రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు. ట్రస్ట్ కార్యాలయ ఆవరణలో రంగారావు కుమారుడు సుమేంద్రకు చెక్కు అందించారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్ కోసమే మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సిబ్బంది

కొత్తపట్నం: పేద కుటుంబాల విద్యార్థుల భవిష్యత్ బాగుపడటం కోసమే వారికి సేవలు అందించడంతో పాటు ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అడపాల అయ్యప్ప అన్నారు. కొత్తపట్నం డీటీ కాలనీలో లయన్స్ క్లబ్ లెజెండనరీ సిటిజన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీపీ స్కూల్లో చదువుతున్న ఎస్టీ విద్యార్థులు, తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాట్లాడుతూ పేదరికంతో ఉన్న విద్యార్థులను లయన్స్ క్లబ్ ఆదుకుంటుందన్నారు. డీటీ కాలనీలో అందరూ ఎస్టీలేనని, వారి పిల్లలకు కనీసం పుస్తకాలు, పెన్నులు, పలకలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఉందని అన్నారు. ఆ విషయం తెలుసుకుని వారికి వాటిని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మొత్తం రూ.17 వేల విలువ చేసే నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, చార్టులు, బకెట్స్, కూలింగ్ వాటర్ క్యాన్‌లు, ప్యాడ్‌లు ఉచితంగా ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-1 తులసికుమారి, ఎంఈవో-2 పద్మావతి, కొత్తపట్నం హైస్కూల్ హెచ్‌ఎం ఎం.శ్రీదేవి, సెక్రటరీ సోమయ్య, లేజర్ చైర్మన్ శ్రీనివాస్, జోన్ చైర్మన్ రామకృష్ణ, క్లబ్ ఫ్లండర్ నరసింహరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, వెంకట్రావు, లక్ష్మణ్, క్లబ్ సభ్యులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయుడు బంకా కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు సమతానగర్‌లో చోరీ



దొంగలు పగులకొట్టిన బీరువా లాకర్

ఒంగోలు టౌన్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలుపడి దోచుకెళ్లిన సంఘటన ఒంగోలు సమతానగర్‌లో జరిగింది. స్థానిక గుప్తా స్కేర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో పనిచేసే కొలసాని బాలకృష్ణ సమతానగర్ రెండో లైనులో తల్లితో కలిసి నివాసం ఉంటున్నారు. ఈ నెల 10వ తేదీ బాలకృష్ణ తల్లి షిరిడీ యాత్రకు వెళ్లారు. 11వ తేదీ రాత్రి ఒక ఫంక్షన్‌కు వెళ్లిన బాలకృష్ణ.. మరుసటి రోజు శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చారు. ఇంటి ప్రధాన ద్వారం పగులకొట్టి ఉంది. లోపలకు వెళ్లి చూడగా బెడ్‌రూంలోని బీరువా లాకర్ పగులకొట్టి ఉంది. అందులోని బంగారం, కప్ బోర్డులో దాచి ఉంచిన లక్షన్నర నగదును దొంగలు తీసుకెళ్లినట్లు తాలూకా పోలీసులకు బాలకృష్ణ ఫిర్యాదు చేశారు. సీఐ ఖాజావలి ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం సాక్ష్యాలు సేకరించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మాతృత్వ వందన యోజన, సాధికారతపై అవగాహన



మాట్లాడుతున్న సీడీపీవో సుధా మారుతి

పొదిలి: ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన, మహిళా సాధికారత, కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. మాదాలవారిపాలెంలోని రామాయణ ఖండ్రిక అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో సుధామారుతి మాట్లాడుతూ మారుతున్న కాల పరిస్థితులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కొత్త చట్టాల గురించి వివరించారు. పీఎంఎంవీవై, మహిళా సాధికారత గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులైన వారికి అక్కడ అందచేస్తున్న పౌష్టికాహారం గురించి తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుభాషిణి, ఎంఎల్‌హెచ్‌పీ అవినాష్ బాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పొగాకు ధరలు ఇలానే ఉంటాయనుకోవద్దు



మాట్లాడుతున్న ఏఎస్ గిరిరాజ్‌కుమార్

పొదిలి: పొగాకు ధరలు భవిష్యత్‌లో కూడా ఇలాగే ఉంటాయనుకోవద్దని, అంతర్జాతీయ పరిణామాలు మారితే ధరలు కూడా మారతాయని పొగాకు వేలం అధికారి గిరిరాజ్‌కుమార్ చెప్పారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. గిరిరాజ్‌కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ పరిస్థితులు, ఆయా దేశాల్లోని పొగాకు ఉత్పత్తి, ఇతర అంశాలపై ధరలు ఆధారపడి ఉంటాయని చెప్పారు. ఇదే ధరలు ఉంటాయని రైతులు భావించి అధిక మొత్తంలో బ్యారన్‌లు, పొలాలు కౌలుకు తీసుకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలా చేస్తే తప్పని సరిగా పొగాకు రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బోర్డు అనుమతి లేకుండా పొగాకు బ్యారన్‌లు నిర్మిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుని వారికి ఉన్న లైసెన్సులు కూడా రద్దు చేస్తారన్నారు. బోర్డు సూచించిన మేరకు మాత్రమే పొగాకు సాగు చేపట్టాలన్నారు. పొగాకుకు ప్రత్యామ్నాయంగా ఇతర లాభసాటి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలన్నారు. లోతట్టు, పల్లపు ప్రాంతాల్లో పొగాకు సాగు చేయవద్దని కోరారు. రైతులు ఉత్తమమైన యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ విస్తీర్ణంలో నాణ్యమైన అధిక పొగాకును ఉత్పత్తి చేయాలన్నారు. భూసారాన్ని పెంపొందించుకునేందుకు రైతులు తమ పొలాల్లో పచ్చిరొట్ట పైర్లను సాగు చేయాలన్నారు. అదును దాటిన తరువాత చేపట్టే సాగులో మల్లె ఏర్పడి, లోగ్రేడ్ పొగాకు వచ్చి రైతులు నష్టపోతారన్నారు.

పంటల సాగు ధ్రువీకరణ పత్రాలు పొందాలి



వీఆర్వోలు, వీపీఏలకు సూచనలిస్తున్న తహసీల్దార్ సుధాకర్‌బాబు

కురిచేడు: కౌలు రైతులందరూ తాము సాగు చేసుకునే పంటల సాగుకు ధ్రువీకరణ పత్రాలు పొందాలని మండల వ్యవసాయాధికారి మధుబాబు శుక్రవారం సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వీపీఏలకు పంటల సాగు ధ్రువీకరణపత్రంపై అవగాహన సమావేశం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ రైతులు సొంతభూమి లేని రైతులు, వేరే వారి భూమిలో పంటలు పండిస్తారో వారు పంటల సాగు ధ్రువీకరణ పత్రాలు పొందటానికి అర్హులని తెలిపారు. పంటల సాగు హక్కు పత్రాలు పొందటం కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే పంట నష్టపరిహారం, రాయితీపై విత్తనాలు, పంటల బీమాకు అర్హత పొందవచ్చన్నారు. అదే విధంగా బ్యాంకు రుణాలు పొందేందుకు అవకాశం కలుగుతుందన్నారు. పంటల సాగు హక్కు పత్రం పొందేందుకు భూమి యజమాని పట్టాదారు పాసుపుస్తకం జిరాక్సు, భూమి యజమాని ఆధార్‌కార్డు జిరాక్స్, కౌలుదారు ఆధార్‌కార్డు జిరాక్సు, యజమాని, మరియు కౌలురైతు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని వీఆర్వోని కలిసి పంటలసాగు హక్కుపత్రం పొందాలని తెలిపారు. తహసీల్దార్ ఏవీ సుధాకరబాబు, డీటీ రాధాకృష్ణ, వీఆర్వోలు, వీపీఏలు పాల్గొన్నారు.

మందుగుండు సామగ్రి గోడౌన్ తనిఖీ



మందు గుండు సామగ్రిని పరిశీలిస్తున్న డీఎస్పీ అశోక్‌వర్ధన్

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని సలకనూతల, దొండ్లేరు గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న లైసెన్స్‌డ్ మందుగుండు సామగ్రి అమ్మే మణికంఠ ఎంటర్‌ప్రైజెస్ గోడౌన్‌ను శుక్రవారం దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ తనిఖీ చేశారు. అనంతరం స్టాక్‌కు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, రెడ్‌ఫ్లాగ్స్, వాటర్ ఫెసిలిటీ, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి నిర్వాహకులకు తెలియజేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఆయన వెంట పొదిలి సీఐ మల్లిఖార్జునరావు, ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- భర్తకు గాయాలు



సంఘటన స్థలంలో ప్రమాదానికి గురైన కారు, బైకు

ఒంగోలు టౌన్: రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతిచెందగా, ఆమె భర్తకు గాయాలయ్యాయి. ఒంగోలు నగరానికి చెందిన దంపతులు షేక్ అలీ, నజీమున్ శుక్రవారం కావడంతో ద్విచక్ర వాహనంపై పెదకొత్తపల్లిలోని దర్గాకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మద్దిపాడు మండలంలోని కొష్టాల వద్ద రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నజీమున్ అక్కడికక్కడే మృతి చెందగా, అలీకి గాయాలయ్యాయి. అతన్ని వెంటనే వైద్యశాలకు తరలించారు. మద్దిపాడు ఎస్ఐ మహేష్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



మరణించిన నజీమున్